ఆర్థిక సాయం

చేగుంట, సెప్టెంబర్ 4 : మృతి చెందిన బాధిత కుటుంబానికి చేగుంట వాసవి క్లబ్ జోన్ చైర్మన్ అయిత పరంజ్యోతి బియ్యం, నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. చేగుంట మండల కేంద్రానికి చెందిన బయ్యా సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందగా, నిరుపేద కుటుంబం కావడంతో బుధవారం పరామర్శించి, అంత్రియలకు రూ.3 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయన వెంట నాగరాజు, కిష్టయ్య, పోశెట్టి, దశరథం, రమేశ్ గౌడ్, ఎర్ర యాదగిరి, బాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు బైక్‌పైనుంచి పడి యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన పెద్దశంకరంపేట మండలం ఉత్తులూరు గ్రామశివారులో చోటు చేసుకుంది. బుధవారం స్థానిక ఎస్సై శంకర్ తెలిపిన ప్రకారం.. మండలపరిధిలోని మాడ్చెట్‌పల్లి గ్రామానికి చెందిన కాయిత రమేశ్ (38) పెద్దశంకరంపేట నుంచి మంగళవారం రాత్రి మాడ్చెట్‌పల్లికి ఇంటికి వెళ్తుండగా ఉత్తులూరు గేటు సమీపంలో బైక్‌పై నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యవేక్షకుడిని విధుల నుంచి తొలిగించాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 4: చిన్నశంకరంపేటలోని పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన మండల ఆశవర్కర్లపై చెయ్యి చేసుకున్న దవాఖాన పర్యవేక్షకుడు అనిల్ డేవిడ్‌ను విధుల నుంచి వెంటనే తొలిగించాలని డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాలు సమత, సీఐటీయూ జిల్లా నాయకుడు అజయ్ వైద్యాధికారి సాయి సింధును కలిసి మాట్లాడారు. మహిళలపై దాడికి పాల్పడితే ఎంతటివారినైనా శిక్షించాల్సిందేనన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 4 : జిల్లా కేంద్రం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిషు సబ్జెక్ట్‌కు ఒక పోస్టు ఖాళీ ఉందన్నారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ వరకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కూలిన ఇండ్లను పరిశీలించిన తహసీల్దార్

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్ 4: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో కూలిపోయిన ఇండ్లను తహసీల్దార్ మధుసూదన్, ఎస్సై షేక్ మహబూబ్ బుధవారం సందర్శించి పరిశీలించారు. మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, మాజీ ఉపసర్పంచ్ రాగుల సంపత్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ నాగుల పల్లి బాలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

వర్గల్,సెప్టెంబర్ 4: వర్గల్ మండలం మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థినులు అధ్యాపకులుగా మారి ఆకట్టుకున్నారు. ఆధ్యాపకులకు విద్యార్థులే వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, ఏటీపీ ఉమామహేశ్వరి, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయపోల్,సెప్టెంబర్ 4: మండలంలోని ఎల్కల్‌లో అక్రమంగా తరలిస్తున్న 70 బ్యాగుల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, బేగంపేట పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. బుధవారం మధ్యాహ్నం సమాచారం మేరకు గ్రామానికి చెందిన గబ్బెట మల్లేశం తన కిరాణాషాపులో అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని గుర్తించి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

రేగోడ్,సెప్టెంబర్ 4: గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ శాంతియుతంగా జరుపుకోవాలి. నిబంధనలను అతిక్రమిస్తే ఎంత టి వారైనా చర్యలు తప్పవని బుధవారం రేగోడ్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీలో ఎస్సై పోచయ్య హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం, జీతం 16 K to 18K, ఏజెంట్ కమిషన్ 6K Ph: 9640258899/9640468899.
NT-331758
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చిన్నశంకరం పేట : చందంపేట శివారులో వరద నీటిలో మునిగిన వరిచేను

చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో వర్షానికి నేలపాలైన మొక్కజొన్న

చిన్నశంకరం పేట : అలుగు పారుతున్న శాలిపేట నల్లచెరువు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రి దామోదర రాజనర్సింహ

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

మెదక్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని, మెదక్ జిల్లాను ప్రగతి పథంలో ముందు వరుసలో ఉంచాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం విద్య, ఆరోగ్య, పంచాయతీ, మున్సిపల్, వ్యవసాయ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, అభయ హస్తం, ఆర్టీసీ శాఖలపై జిల్లా అభివృద్ధి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మెదక్ ప్రభుత్వ దవాఖానలో 30 రోజుల్లో సిటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో నూతన మెడికల్ కళాశాలకు అభ్యర్థించామని.. అది పరిశీలనలో ఉందన్నారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు అందించి విద్యార్థులకు విద్యను ప్రోత్సహించాలన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ కొనసాగాలని, పెండింగ్ భవనాలు, రోడ్లు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమీక్ష సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు ఇచ్చిన సూచనలు తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

జోన్ మార్పిడి చేయాలి..

మెదక్ జిల్లా ప్రజల ఆకాంక్ష మేరకు జిల్లాను రాజన్నజోన్ నుంచి చార్మినార్ జోన్‌కు మార్చేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, ట్రెస అధ్యక్షుడు మహేందర్ గౌడ్‌తో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ మంత్రికి జ్ఞాపికను అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు మహ్మద్ ఇక్బాల్ పాషా, ట్రెస నాయకులు సిద్ధు, పరమేశ్వర్, నాగరాజు, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో పూజలు చేసిన మంత్రి

కౌడిపల్లి, సెప్టెంబర్ 4 : కౌడిపల్లి పెద్ద చెరువు నిండి మత్తడి పారుతుండడంతో మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గంగమ్మకు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోర్లలో నీటిశాతం పెరిగి వేసవిలో కూడా పంటలు పండి రైతులు సమృద్ధిగా పాడిపంటలతో సుఖసంతోషాలతో ఉంటారని తెలిపారు. గంగమ్మకు కొబ్బరికాయ కొట్టి చీర సారెతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, శివాంజనేయులు, మహ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి, కౌడిపల్లి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : విద్య, వైద్యం, రైతుల సమస్యల పరిష్కారం దిశగా ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అభిప్రాయాన్ని వెల్లడించారు. కలెక్టరేట్‌లో జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం దిశగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని సూచించారు. తద్వారా పరిష్కారానికి అవకాశం దొరుకుతుందన్నారు. తెలంగాణలో అత్యధిక శాతం ఉన్న రైతుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. రుణమాఫీ విషయంలో తక్షణ చర్యలు చేపట్టి అందరికీ వర్తించేలా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వర్షం వల్ల దెబ్బతిన్న నీటి వనరులు, రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరారు. పాపన్నపేట మండలం యూసుఫ్ పేట, కొత్తపల్లి మధ్య ఇటీవల నిర్మించిన బ్రిడ్జి ఇరువైపులా కొద్ది మేర రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పనులు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అమ్మబడి, మన ఊరు మన బడి, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు సంబంధించి బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి నెల లోపల మెదక్ దవాఖానలో సిటీ స్కాన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం హర్షనీయమన్నారు.

వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మెదక్‌లో వైద్య కళాశాల ప్రక్రియను వేగవంతం చేసి ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు నిర్వహించే విధంగా కృషి చేయాలని మంత్రిని కోరారు. ఇటీవల డయాలసిస్ రోగులు ఎక్కువ కావడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తూప్రాన్ లో మరో డయాసిస్ సెంటర్ ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందన్నారు. ఎంసీహెచ్‌లో డాక్టర్లను నియమించడంతోపాటు, నర్సుల సంఖ్యను పెంచాలని సూచించారు. పేషెంట్స్‌తో పాటు వచ్చే అటెండర్లు, బంధువులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే దిశగా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంసీహెచ్‌లో వెయిటింగ్ హాల్/షెడ్ నిర్మాణం చేయాలని సూచించారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ప్రాంతంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ప్రాథమిక వైద్య కేంద్రం పీహెచ్‌సీ ఉండేలా చూడాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి సానుకూలంగా స్పందించడంతో సుభాష్ రెడ్డి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

రామాయంపేటలో మాట్లాడుతున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు

రామాయంపేట, సెప్టెంబర్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని రాష్ట్రంలో పూర్తిగా భ్రష్టు పట్టిస్తుందని అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని భారతమాత ఆలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు సరైన సమయంలో ఫీజు రీ యింబర్స్‌మెంట్ ఇవ్వక తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. సమావేశంలో భాను, అర్జున్, దుర్గాప్రసాద్, దీక్షిత్, భరత్, మణికంఠ, స్వాతిక, జయంతి ఉన్నారు.

53 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 53 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు.

చేగుంట నుంచి ఏడుగురు..

చేగుంట,సెప్టెంబర్ 4 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా చేగుంట మండలం నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. చేగుంట పాఠశాలకు చెందిన గార్లస్ మనోహర్‌రావు,రావుల వెంకటేశ్, చందాయిపేట సలీం,అజిత,రెడ్డిపల్లి కృష్ణమూర్తి,కర్నాల్‌పల్లి సత్యనారాయణ, కసాన్‌పల్లి సంగీత ఎంపికైనట్లు మండల విద్యాధికారి బుచ్చనాయక్ తెలిపారు.

రేగోడ్ లో..

రేగోడ్,సెప్టెంబర్ 4: మోడల్ స్కూల్ కాలేజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నిశాంత్ కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జయప్రకాశ్ తెలిపారు.

వరద నీటి సమస్యను పరిష్కరించాలి

వరద నీటి వల్ల నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు

నిజాంపేట, సెప్టెంబర్ 4 : గ్రామం నుంచి వచ్చే వరద నీటి వల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని, సమస్యను పరిష్కరించాలని నందిగామ గ్రామ రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామం నుంచి పెద్ద ఎత్తున వరద కాల్వల ద్వారా పంట పొలాలకు రావడంతో సుమారు 20 మంది రైతులు సాగు చేస్తున్న 65 ఎకరాల వరి చేనులు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కొమురయ్య, శ్రీశైలం, మల్లేశం, దాసు, సంపత్, చోటేమియా, రమేశ్, సిద్ధిరాములు, రాంచంద్రరెడ్డి, సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

చేగుంటలో..

చేగుంట, సెప్టెంబర్ 4 : వర్షాలకు టమాట, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. మక్కరాజిపేట శివారులోని కర్నాల్‌పల్లి అసన్నబాద్ గడ్డలోని పంబాల నర్సింహులు, రాయలపురం ముత్యాలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు.

చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి పొంగిపొర్లుతున్న సందర్భంగా చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ సూచించారు. బుధవారం చిన్నశంకరంపేటలోని ఠాణాను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. చెరువులు, కుంటలు నిండు కుండలా ఉన్నాయని చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. అత్యవసరంలో డయల్ 100 కి ఫోన్ చేయాలన్నారు.

చెరువు గండిని పూడ్చాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 4 : ప్రతి ఏడు వానలు పుష్కలంగా కురువడంతో ప్రతి సారి చెరువుకు బుంగ పడి నీరు వృథా గా పోతున్నదని మండల పరిధి రుద్రారం, చందంపేట గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కురుస్తున్న వర్షాలకు గ్రామాల శివారులోని పెద్ద చెరువుకు వరద నీరు చేరడంతో చెరువుకు బుంగ పడింది. గ్రామస్తులు కట్టు కలిసిగా ఇసుక బస్తాలను అడ్డుగా పెట్టి తాత్కాలికంగా నీటివృథాను ఆపగలిగారు. ప్రతి సారి ఇలానే జరుగుతుందని జిల్లా పాలనాధికారి చొరవ తీసుకొని చెరువుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గండి పూడ్చివేత

రామాయంపేట, సెప్టెంబర్ 4 : మండల పరిధిలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలోని పెద్ద చెరువు పొంగి పొర్లడంతో చెరువు కట్టకు గండి పడింది. రెండు రోజులుగా నీరు వెళ్తుండడంతో విషయం తెలుసుకున్న రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి తమ సిబ్బందితో బుధవారం గ్రామ చెరువు వద్దకు చేరుకుని ట్రాక్టర్లు, జేసీబీల సాయంతో మట్టిని ట్రాక్టర్లతో తీసుకువచ్చి పూడ్చివేశారు. తహసీల్దార్ చెరువు బుంగ ను పూడ్చడంతో గ్రామస్తులు, గ్రామ రైతులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, సెప్టెంబర్ 4 : ప్రాణం పోతే కాని రోడ్డుపై గుంత పూడ్చరా అని ప్రయాణికులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షానికి భారీ గుంత ఏర్పడింది. గొల్లపల్లి, లింగాపూర్ గ్రామాల మధ్య రహదారిపై గుంత ఏర్పడడంతో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారింది. రోడ్డుపై భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతను పూడ్చి వాహనదారుల ఇబ్బందులను తొలిగించాలని కోరుతున్నారు.

రామాయంపేట : ట్రాక్టర్లతో బుంగను పూడ్చివేయిస్తున్న తహసీల్దార్ రజనీకుమారి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాలరాజు

రామాయంపేట, సెప్టెంబర్ 4 : గ్రామాల్లోని ప్రజలు సైబర్ నేరాల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని రామాయంపేట ఎస్సై బాలరాజు పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట మండలం ఝాన్సిలింగాపూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో గ్రామగ్రామాన ప్రజలు, యువకులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అంత్యక్రియల్లో పాల్గొన్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట, సెప్టెంబర్ 4 : మండల పరిధిలోని ఝాన్సీలింగాపూర్‌లో అనారోగ్యంతో మాజీ సర్పంచ్ రామకిష్టయ్య కుమారుడు రాజు బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని మాజీ సర్పంచ్ రామకృష్టయ్యను పరామర్శించారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పుట్టి యాదగిరి, సిద్ధిరాంరెడ్డి, శ్యాములు, సుభాశ్, సిద్ధిరాములు తదితరులు నివాళులర్పించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

చేగుంట, సెప్టెంబర్ 4 : చేగుంట మండలం వడియారం బైపాస్‌లో రెండు వాహనాలు ఢీకొనడంతో పలువురికి గాయాలు కాగా, గాయపడిన క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా, మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం బైపాస్‌లో రెండు వాహనాలు ఢీకొనడంతో స్పందించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అక్కడే అగి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. దగ్గరుండి క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.

కాంగ్రెస్ నేతలది అత్యుత్సాహం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్‌లో ప్రెస్‌మీట్ అనంతరం నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్, సెప్టెంబర్ 4 : నర్సాపూర్ నియోజకవర్గంలో నడుస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ కాంగ్రెస్ నాయకులకు చురకలంటించారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని విమర్శించినందుకు బీఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులకు ఘాటుగా కౌంటరిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ నర్సాపూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ కూడా ఎలాంటి ప్రొటోకాల్ లేకున్నా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఖమ్మంలో మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వాహనంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగుకుంటున్నారని వెల్లడించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్యంగౌడ్, శివంపేట్ మాజీ ఎంపీపీ హరికృష్ణ, నర్సాపూర్ పట్టణాధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్వీకే జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, జగదీశ్వర్, నాగరాజుగౌడ్, రామాగౌడ్, రమణాగౌడ్ నాయకులు పాల్గొన్నారు.

సమాజంలో గురువులది ప్రథమ స్థానం

పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శివ్వంపేట, సెప్టెంబర్ 4 : విద్యను మించింది ఏదీ లేదని అలాంటి విద్యను అందించే గురువులకు సమాజంలో ప్రథమస్థానం ఉందని లయన్స్ క్లబ్ అఫ్ బాలానగర్ ఇలైట్ 320–బీ జిల్లా గవర్నర్ టి.రాజేంద్ర ప్రసాద్, ఎంఈవో బుచ్యానాయక్ అన్నారు. బుధవారం శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ లింగోజీ స్మారక విద్యా, సేవా పురస్కారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అయన కుమారులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. లింగోజీ సహోద్యోగులకు, ఉపాధ్యాయులకు, సామాజిక సేవా కార్యకర్తలకు జ్ఞాపికలను అందించి శాలువాతో సన్మానించారు. లయన్స్‌క్లబ్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడికి సీఎం బాధ్యత వహించాలి

మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలం అవుతుంటే ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం పర్యటనపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు విమర్శించారు. బుధవారం వారు మాట్లాడారు. కేవలం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దాడికి పూర్తిగా సీఎం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

మండపాల్లో డీజేలకు అనుమతి లేదు

ఎస్సై మహిపాల్‌రెడ్డి


పెద్దశంకరంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

శివ్వంపేట, సెప్టెంబర్ 4 : వినాయకచవితి పండుగ వేడుకలను పీస్‌ఫుల్ వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు ఎస్సై మహిపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రజలకు పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని సూచించారు. ఈ నెల 16న మిలాద్ ఉన్‌నబీ పండగను ముస్లింలు శాంతియుతం గా జరుపుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్ జానీ, రాజు, గోపాల్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 4 : శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలని పేట ఎస్సై శంకర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణానికి చెందిన హిందువులు, మైనార్టీ పెద్దలు, మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గణేశ్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు.